# గడ్డం బ్యాచ్ పీచేముడ్



- నిరసన తెలిపేందుకు వచ్చిన పెద్దపల్లి ఎంపీ వర్గీయులను అడ్డుకున్న పీఎస్సార్ అనుచరులు
- ఎక్కడో అవమానం జరిగితే.. ఇక్కడికి వచ్చి షో చేయాలా?
- అవన్నీ ఇక్కడ కుదరవంటున్న ప్రేమ్ సాగర్ రావు అనుచరులు
- మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ లో ముదురుతున్న వర్గ పోరు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ లో వర్గవిభేదాలు కొనసాగుతున్నాయి. రెండు రోజుల క్రితం చెన్నూర్ క్యాంపు ఆఫీసులో షాడో ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు ఇప్పటికే అధికార పార్టీలో కలకలం రేపుతున్నాయి. మరో వైపు పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ప్రొటోకాల్ రగడ కొనసాగుతుంది. ఆ వేడి చల్లారక ముందే మంచిర్యాలలో గడ్డం వివేక్, వంశీకృష్ణ వర్గీయులు తమ నేతలను అవమానిస్తున్నారంటూ నిరసనకు దిగడంతో ఎమ్మెల్యే పీఎస్సార్ వర్గీయులు అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత కుమ్ములాట మరోసారి బహిర్గతమయ్యాయి. మంచిర్యాల ఐబీ చౌరస్తాలో యూత్ కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపేందుకు రాగా, పీఎస్సార్ వర్గీయులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సొంత పార్టీపై నిరసనలు తెలియజేయడమేంటని ప్రశ్నించారు. అంతర్గతంగా చర్చించుకోవాల్సిన విషయాలకు ఎందుకు రోడ్డెక్కారంటూ ప్రశ్నించారు. అవమానం జరిగిన చోటే తేల్చుకోవాలని, ఇక్కడికి వచ్చి షో చేస్తామంటూ ఊరుకునేది లేదని ఘాటగా హెచ్చరించారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు వచ్చి గడ్డం వర్గీయులకు నచ్చజెప్పి వెనక్కి పంపించారు. దీంతో పీఎస్సార్ వర్గం పై చేయి సాధించినట్లయ్యింది.

మంచిర్యాల జిల్లాలో అధికార పార్టీ ఎమ్మెల్యేల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. దీంతో పార్టీ సీనియర్ నాయకులు ఎటు వైపుల ఉండాలో తేల్చుకోలేక సతమతమవుతున్నారు. ఎమ్మెల్యేల మధ్య సమన్వయం లేమితో పార్టీ పెద్దలు సైతం దిక్కులు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

**కుటుంబ పెత్తనంపై గుర్రు..**

పెద్దపల్లి ఎంపీ, చెన్నూర్, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు ఒకే కటుంబానికి చెందిన వారు కావడంతో పార్లమెంట్ పరిధిలోని కాంగ్రెస్ శ్రేణులు కుటుంబ పెత్తనాన్ని జీర్ణించుకోలేకపోతున్నాయి. ఏండ్లుగా పార్టీ జెండాను మోస్తున్న తమను కాదని, పార్టీలు మారుతున్న గడ్డం ఫ్యామిలీతో కాంగ్రెస్ పార్టీలోని సీనియర్లు, ప్రధాన లీడర్లు సఖ్యతగా కొనసాగలేకపోతున్నారు. అదే సమయంలో పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి తమకంటూ ప్రత్యేక గ్రూపును తయారు చేసుకుంటున్నారని, గ్రూపు రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని హస్తం పార్టీలో ముందు నుంచి గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు ప్రస్తుత పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ ... కాంగ్రెస్ పార్టీ ఎంపీ టికెట్ ఖరారు చేయక ముందే తానే అభ్యర్థినంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నాడంటూ పార్టీ అధిష్టానానికి ఫిర్యాదులు సైతం వెళ్లాయి. దీంతో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో వ్యతిరేకత వ్యక్తమైంది. వెంటనే తేరుకున్న గడ్డం ఫ్యామిలీ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఆశ్రయించి ఎలాగైనా తమకు మార్గం సుగమం చేయాలని వేడుకున్నారంటూ ఎన్నికల సమయంలో ఇటు మీడియాలో, అటు సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరిగింది. పార్టీ మళ్లీ గాడిలో పడుతున్న నేపథ్యంలో పార్టీ పెద్దలు కూడా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలోని ముఖ్యనేతలు, కార్యకర్తలను సముదాయించారు. దీంతో పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి సీటును కాంగ్రెస్ గెలుచుకుంది. కొద్ది రోజుల పాటు గడ్డం ఫ్యామిలీ సఖ్యతగానే ఉన్నట్లు కనిపించినా పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది.

**మంత్రి పదవే కారణమా?**

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తొలి విడతలో మంత్రి పదవులను పరిమితంగానే కేటాయించింది. రెండో విడత మంత్రి వర్గ విస్తరణ రేపోమాపో ఉంటుందంటూ మీడియాలో, అటు కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో ప్రచారం సాగుతున్నది. అయితే చెన్నూర్ నుంచి గెలిచిన వివేక్ వెంకటస్వామితో పాటు బెల్లంపల్లి నుంచి గెలిచిన గడ్డం వినోద్ సైతం మంత్రి పదవి కోసం ఏఐసీసీ స్థాయిలో తమ ప్రయత్నాలు సాగిస్తున్నారు. దీంతో పార్టీలో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఒక్క కుటుంబానికే పదవులా అనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి. దీంతో గడ్డం ఫ్యామిలీ సైతం తమకు మంత్రి పదవి రాదేమోనని లోలోపల రగులుతున్నట్లు సమాచారం. తమ తండ్రి కాంగ్రెస్ పార్టీకి, ఇటు జిల్లాకు ఎన్నో సేవలందించారని, తమను విస్మరించడం తగదని పార్టీ పెద్దల వద్ద విన్నించుకుంటున్నట్లు సమాచారం.

**పీఎస్సార్ చెక్**

పదేళ్ల పాటు కాంగ్రెస్ అధికారంలో లేకున్నా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పార్టీ జెండా మోసిన వారు ఎంతో మంది ఉన్నారని, అప్పటి అధికార పార్టీ నుంచి ఇబ్బందులు ఎదురైనా తట్టుకొని నిలబడ్డారని మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్సార్ ముందు నుంచి తన వాణి వినిపిస్తూనే ఉన్నారు. ఇటీవల ఏకంగా డిప్యూటీ సీఎం సభలో తనదైన శైలిలో వార్నింగ్ కూడా ఇచ్చారు. పార్టీలు మారిన వారికి పదవులు ఇస్తే ఊరుకునేది లేదని, అడవి జిల్లా బిడ్డల గొంతు కోస్తామంటే సహించేది లేదంటూ ఏకంగా బహిరంగ సభలోనే తన స్టైల్ లో హెచ్చరించారు. దీంతో పీఎస్సార్ వార్నింగ్ ను కాంగ్రెస్ పార్టీ కూడా పరిగణనలోకి తీసుకుందని, ప్రేమ్ సాగర్ రావు వ్యాఖ్యల్లో వాస్తవం ఉందని గ్రహించింది.

**అక్కడి నుంచే మొదలు**

మంచిర్యాల సభ నుంచే గడ్డం ఫ్యామిలీ గ్రూపు రాజకీయాలను మరింత ప్రోత్సహిస్తున్నదనే వాదన పార్టీ వర్గాల్లో వినిపిస్తున్నది. కాళేశ్వరం సరస్వతీ పుష్కరాల్లో పెద్దపల్లి ఎంపీని ఆహ్వానించకపోవడం, ఫ్లెక్సీల్లో ఫొటో లేకపోవడాన్ని తమకు అనుకూలంగా మలుచుకుందని కాంగ్రెస్ పార్టీలో చర్చ జరుగుతున్నది. ఈ విషయంలో ప్రతిపక్ష పార్టీల నాయకులు పెద్దపల్లి ఎంపీ ప్రొటోకాల్ విషయంలో చేస్తున్న వ్యాఖ్యలను వివేక్ అనుకూల మీడియాలో ప్రచారం కావడంపై పార్టీ పెద్దలు కూడా కాస్త ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. ఇక లాభం లేదనుకున్న గడ్డం వివేక్, వంశీకృష్ణ తమ అనుచరులతో నిరసనలు చేయిస్తున్నారని టాక్ వినిపస్తున్నది.

**గడ్డం బ్యాచ్ ను అడ్డు పీఎస్సార్ వర్గీయులు**

పెద్దపల్లి ఎంపీ ప్రొటోకాల్ విషయంలో గడ్డం వంశీకృష్ణ అనుచరులు బుధవారం నిరసన తెలిపేందుకు వచ్చారు. విషయం తెలుసకున్న పీఎస్సార్ వర్గీయులు వారిని అడ్డుకున్నారు. దీంతో వంశీకృష్ణ అనుచరులు పీచేముడ్ అంటూ వెళ్లిపోయారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని విచ్ఛిన్నం చేసేందుకు చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ యత్నిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో గ్రూప్ రాజకీయాలను ప్రోత్స హిస్తే చూస్తూ ఊరుకోమని స్పష్టం చేశారు. దళిత ఎంపీకి ఎక్కడ అవమానం జరిగిందో అక్కడే ధర్నాలు, రాస్తారోకోలు చేసుకోవాలే తప్ప.. మంచిర్యాలకు వచ్చి షో చేస్తామంటే ఊరుకోమని హెచ్చరించారు. జిల్లాలో ఒక కుటుంబంలా ఉన్న కాంగ్రెస్ పార్టీని తండ్రీకొడుకులు కలిసి విడగొట్టే ప్రయత్నం చేస్తున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

**కాంగ్రెస్ వైఖరిపై వంశీ వర్గీయుల ఆగ్రహం**

మరో వైపు వంశీవర్గీయులు సైతం కాంగ్రెస్ పార్టీ వైఖరిని తప్పు పడుతున్నారు. కాళేశ్వరంలో జరుగు తున్న సరస్వతీ పుష్కరాల ఏర్పాట్లలో పెద్దపల్లి ఎంపీ తనవంతు కృషి చేశారని చెబుతున్నారు .పుష్కర ప్రదేశాన్ని పరిశీలించి ఏర్పాట్లు చేయించారని పేర్కొంటున్నారు. ప్రజాప్రతినిధికి ప్రొటో కాల్ ఇవ్వకుండా అవమానిస్తున్నారంటూ మండిపడుతున్నారు. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంచిర్యాల ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి, ప్లకార్డులతో నిరసన తెలిజేయడానికి వస్తే పీఎస్సార్ వర్గీయులు వచ్చి అడ్డుకున్నారని ఆరోపిస్తున్నారు. ఇలా జిల్లా కేంద్రంలో ఇరువర్గాలు బాహాబాహికి దిగడం చర్చనీయాంశంగా మారింది.



## 'వైజంక్షన్' టోల్ టాక్స్ ఎత్తివేయాలి

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్**

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

కిష్టంపేట వై జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన టోల్ గేట్ తక్షణం ఎత్తివేయాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర గౌడ్ ఆధ్వర్యంలో వై జంక్షన్ వద్ద రాస్తారోకో చేశారు... ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా గ్రీన్ టాక్స్ పేరుతోప చెన్నూరు ప్రాంత ప్రజలను ఫారెస్ట్ అధికారులు దోపిడీకి గురి చేస్తున్నారని ఇది సరైన విధానం కాదని... చత్తీస్గడ్ మహారాష్ట్ర రాష్ట్రాల్లో సైతం దట్టమైన అడవుల్లో సైతం ఈ టాక్స్ వసూలు చేయడం లేదని... కుందేలు సైతం కానరాని చెన్నూరు ఫారెస్ట్ లో ఈ టాక్స్ వసూలు చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు.. కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాలు నిర్వహిస్తున్న సమయంలో భక్తుల నుండి టోలువసూలు చేయడం శోచనీయం అని ఆయన అన్నారు.. ధర్నా ప్రదేశం నుండి ఫారెస్ట్ అధికారులతో మాట్లాడి టోల్ టాక్స్ ను పుష్కరాలు ముగిసే వరకు వసూలు చేయరాదని చిన్న వాహనాలను శాశ్వతంగా మినహాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు తాత్కాలికంగా ప్రస్తుతానికి టోల్ టాక్స్ వసూలు ఫారెస్ట్ అధికారులు నిలిపివేశారు ఈ కార్యక్రమంలో భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బత్తుల సమ్మయ్య జిల్లా ఉపాధ్యక్షుడు రాపర్తి వెంకటేశ్వర్ మండల అధ్యక్షులు బుర్ర రాజశేఖర్ గౌడ్ పట్టణ అధ్యక్షులు తుమ్మ శ్రీ పాల్ కోటపల్లి మండల అధ్యక్షుడు పెద్దింటి పున్నం చంద్ బిజెపి సీనియర్ నాయకులు కొండపాక చారి జాడి తిరుపతి గర్రెపల్లి వెంకట నరసయ్య కమ్మల శ్రీనివాస్ ఏతం శివకృష్ణ కొరకప్పుల వంశీగౌడ్ ఆలం బాబు కొటారి వెంకటేష్ కాగిత రాజేష్ మాణికరావుశంకర్ బిజెపి సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### గ్రామ పరిపాలన అధికారుల పరీక్షను

## పకడ్బందీగా నిర్వహించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

జిల్లాలో ఈనెల 25వ తేదీన జరగనున్న గ్రామ పరిపాలన అధికారుల పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు లతో కలిసి జిల్లా విద్యా, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, విద్యుత్, సమాచార శాఖల అధికారులు, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ శివాజీ, మండల తహసిల్దార్ రఫతుల్లా లతో కలిసి గ్రామ పరిపాలన అధికారుల పరీక్ష నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో నిర్వహించే గ్రామ పరిపాలన అధికారుల పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 25వ తేదీన జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, ఉదయం 9.30 గంటల నుండి అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోనికి అనుమతించడం జరుగుతుందని, 10 గంటలకు గేటు మూసి వేయడం జరుగు తుందని తెలిపారు. పరీక్ష నిర్వహణ కొరకు ముఖ్య పర్యవేక్షకులు, ఇన్విజిలేటర్లు, ఇతర అధికారులు అవసరమైన సిబ్బందిని నియమించడం జరిగిందని, పరీక్ష కేంద్రం లోనికి మొబైల్ ఫోన్లు అనుమతించడం జరగదని తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ప్రశ్నపత్రాల భద్రత కొరకు స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, నిబంధనల ప్రకారం తహసిల్దార్ తో పాటు భద్రత సిబ్బందితో ప్రశ్నాపత్రాలను తరలించడం జరుగుతుందని, పరీక్ష ముగిసిన తర్వాత పూర్తి భద్రత మధ్య జవాబు పత్రాలను తరలించడం జరుగుతుందని తెలిపారు. అధికారులకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించి జిల్లాలో పరీక్షను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్య, అగ్నిమా పక శాఖ అధికారి రమేష్ బాబు, విద్యుత్ శాఖ ఎస్.ఈ. రమ్యశ్రీ, కలెక్టరేట్ పరిపా లన అధికారి పిన్న రాజేశ్వర్, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షంతో జన జీవనం అతలాకుతలం

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**



మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా బుధవారం కురిసిన వర్షం జనజీవనం అతలాకుతల చేసింది. మధ్యాహ్నం మూడు గంటల వరకు ఉక్కపోతతో ఇబ్బంది పడ్డ జనం ఒక్కసారిగా కురిసిన వర్షంతో మరింత ఇబ్బందులకు గుయ్యారు.

**లబోదిబోమంటున్న రైతులు..**

మంచిర్యాల జిల్లాలో వరి కోతలు ఒక్క వైపు జరుతుండగా వారి కొనుగోళ్లు మరో వైపు జరుగుతున్నాయి. వారం రోజులుగా మారుతున్న వాతావరణ పరిస్థితిలతో రైతులు ఆందోళనకు గురి అవుతుందాగా బుధవారం కురిసిన భారీ వర్షం రైతుల పాలిట శాపంగా మారింది. జిల్లాలోని జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్, మంచిర్యాల, నస్పూర్ మండలంలో 80% ధాన్యం కొనుగోళ్లు పూర్తి అవ్వగా చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గంలో ఇప్పుడూయిప్పుడే కోతలు ఉపందుకున్నాయి. వర్షంతో మరో వారం రోజులపాటు వరి కోతలు ఆపాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు కోతలు కోసి కొనుగోలు కేంద్రాలలో కంట చేసిన ధాన్యం బస్తాలతో పాటు అరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. రైతులు వర్షం నుండి పంటను కాపాడుకునేందుకు టార్పాలిన్ కవర్లు కప్పిన భారీ గాలులకు కొట్టుకుపోయి నష్టం కలిగించాయి.





## హిందూ ఏక్తాయాత్రకు తరలిరండి

**శెనార్తి మీడియా, గన్నేరువరం :**

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మే 22వ తేదీ గురువారం సాయంత్రం 4 గంటలకు కరీంనగర్ పట్టణంలో హిందూ ఏక్తాయాత్ర నిర్వహించనున్నారు. ఈ యాత్రను కేంద్ర మంత్రి బండి సంజయ్ నేతృత్వంలో వైశ్య భవన్ నుంచిప్రారంభించనున్నారు. ప్రతి ఒక్క హిందూ బంధువులు, మేధావులు, మహిళలు, యువకులు హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు, హిందూ ఏక్తాయాత్రను విజయవంతం చేయాలని తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు సోల్లు అజయ్ వర్మ, బీజేపీ గన్నేరువరం మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ ఒక ప్రకటనలో కోరారు. గ్రామాల నుంచి, మండలాల నుంచి, ప్రతి బూత్ నుండి వేలాది మంది హిందూ బంధువులు పాల్గొని, బండి సంజయ్ అడుగుజాడలో అడుగేసి, కంకణబద్ధులై



ఈ యాత్రను విజయవంతం చేయాలని కోరారు. జై భారత్... జై శ్రీరామ్ నినాదాలతో యాత్రను ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.